క్లుప్తంగా

సైబర్ మోసాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

నరసన్నపేట: యువత, విద్యార్థులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, తెలియని నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు సూచించారు. ఉర్లాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా.. ఎంత నిఘా పెడుతున్నా.. సైబర్ నేరగాళ్ల చేతిలో అనేకమంది మోసపోతున్నారన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వంటివి తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏపీఎం కూర్మారావు

హిరమండలం: స్వయం శక్తి సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరమని వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు అన్నారు. మండల సమాఖ్య ప్రతినిధులు సరస్వతి, ప్రభావతి ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ మహిళా సంఘాలు సమాజికంగా, ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలన్నారు. సంఘాల సభ్యులు పంచ సూత్రాలు పాటించాలన్నారు. సంఘంలో పొదుపు చేసిన మొత్తానికి రసీదులు పొందాలన్నారు. సంఘాల లెక్కలు సభ్యులకు అర్థమయ్యేలా నిర్వహించాలని సూచించారు. సంఘం ప్రారంభం నుంచి జరిగిన లావాదేవీలను ఆడిట్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు కార్యాలయ సిబ్బంది. క్లస్టర్ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

నరసన్నపేట: ఎరువుల షాపుల్లో అక్రమ నిల్వలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని నరసన్నపేట ఏడీ రవీంద్రభారతి హెచ్చరించారు. సోమవారం నరసన్నపేటలో ఎరువులు, పురుగు మందుల షాపులను సివిల్ సప్లై డీటీ రామకృష్ణతో కలిసి తనిఖీ చేశారు. రికార్డులతో నిల్వలు సమానంగా ఉండాలన్నారు. లైసెన్స్ ఉన్న మేరకు విక్రయించాలన్నారు. వ్యవసాయాధికారి కె.సునీత పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



స్వామివారికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో ఆశ్వీజ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా సోమవారం రాత్రి స్వామివారికి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. శ్రీముఖలింగేశ్వరునికి అర్చనలు, అభిషేకాలు, పూజలు చేశారు. పార్వతీపరమేశ్వరులను అలంకరించారు. తిరువీధి ఉత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు, అర్చకులు పాల్గొని స్వామివారికి హారతులు ఇచ్చారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పాతపట్నం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకాకుళం పట్టణంలో ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. మండలంలోని రొంపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారని హెచ్‌ఎం నల్లి కుమారస్వామి తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు, గ్రామస్తులు సోమవారం అభినందించారు. పాఠశాలకు చెందిన డి.మనోహర్, పి.ధనుష్, ఆర్.అభినయ్(బృందం) జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో వివిధ మండలాల నుంచి 75 బృందాలు పాల్గొన్నాయన్నారు.

చిరు ధాన్యాలతో.. సంపూర్ణ ఆరోగ్యం

- పాతపట్నం నియోజకవర్గంలో 416 ఎకరాల్లో సాగు
- మైదాన ప్రాంతాల్లో అధికంగా గిరాకీ
- రాయితీపై విత్తనాలు అందజేస్తున్న కొత్తూరు వెలుగు అసోసియేషన్



పాతపట్నం మండలంలోని కరడాసింగి గూడలో వేసిన జొన్న పంట

మెళియాపుట్టి: చాలా మంది చిన్న వయసులోనే మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. చిరు ధాన్యాలతో అధిక లాభాలు ఉన్నాయని వైద్యులు సూచించడంతో కరోనా తర్వాత అత్యధిక శాతం మంది ఆహారపు అలవాట్లను మార్చుకున్నారు. మైదాన ప్రాంత వాసులు పప్పు దినుసులు, చిరుధాన్యాల వైపు మొగ్గు చూపుతున్నారు. పాతపట్నం నియోజకవర్గ వ్యాప్తంగా 416 ఎకరాలలో గిరిజనులు చిరుధాన్యాలను సాగు చేస్తున్నారు. చోడి, రాగులు, కొర్రలు, కందులు, సామలు, జొన్నలు, నల్ల నువ్వులు వంటి పలు రకాల చిరుధాన్యాలను పండిస్తున్నారు. కొత్తూరు వెలుగు అసోసియేషన్ సభ్యులు చిరుధాన్యాల విత్తనాలను రాయితీపై అందిస్తూ సహకరిస్తున్నారు. ఎటువంటి ఎరువులు వేయకుండా గిరిజనులు చిరు ధాన్యాల పంటలను సాగుస్తున్నారు. పంటలను వారపు సంతల్లో విక్రయిస్తున్నారు. పలువురు వ్యాపారులు గిరిజన గ్రామాలకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని ఎకరాలలో చిరుధాన్యాలను పండిస్తామని గిరిజన రైతులు చెబుతున్నారు.

పాతపట్నం నియోజకవర్గంలో చిరు ధాన్యాల సాగు వివరాలు ఇలా..

మండలం	ఎకరాలు	రైతులు
మెళియాపుట్టి	102	128
కొత్తూరు	74	91
పాతపట్నం	94	82
హిరమండలం	62	68
ఎల్.ఎన్.పేట	28	47

ఆరోగ్యం మన చేతుల్లోనే..



కీళ్ల సమస్యలు, మధుమేహం, అధిక బరువు, కంటిచూపు మందగించడం వంటి వ్యాధులు చాలా మందికి అతిచిన్న వయసులోనే వస్తున్నాయి. దానికి కారణం ఆహారపు అలవాట్లే. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. మార్కెట్లో చిరుధాన్యాలతో తయారు చేసిన బిస్కెట్లు, లడ్డూలు, చెకోడీలు ఇలా పలురకాల పదార్థాలు అందుబాటులో ఉన్నాయి. ఉదయం టిఫిన్ కూడా చిరుధాన్యాలతో తయారుచేసుకోవచ్చు.

– డాక్టర్ అలేఖ్య, మెళియాపుట్టి పీహెచ్‌సీ

మరింత సహకారం అందించాలి



నేను ఎకరాలో పోడు వ్యవసాయం చేస్తున్నాను. జొన్నలు, సామలు, కందులు ఇతరత్రా విత్తనాలను కొత్తూరు వెలుగు అసోసియేషన్ సభ్యులు రాయితీపై అందిస్తున్నారు. మేము పండించే చిరుధాన్యాలు మాకు ఆర్థికంగా పురోభివృద్ధి చేకూర్చడమే కాకుండా.. పలువురుకి ఆరోగ్యాన్ని అందిస్తున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు మరింత సహకారం అందించాలి.

– ఎన్.చందరరావు, నేలబొంతు, మెళియాపుట్టి మండలం



మెళియాపుట్టి మండలం ఎర్రమాను గూడలో వేసిన నల్ల నువ్వుల పంట

నల్ల నువ్వులు పండిస్తున్నాం



నల్ల నువ్వుల పంటను నేను ఎకరా 20 సెంట్లలో పండిస్తున్నాను. ఈ విత్తనాలు ఒడిశా నుంచి తీసుకువచ్చాం. మా గ్రామంలో సుమారు పది కుటుంబాలు ఈ పంట పండిస్తున్నాయి. వీటికి చాలా గిరాకీ ఉంది.

– సవర బాబూరావు, పాత్రలోవ, మెళియాపుట్టి మండలం

వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం

- ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఏమైంది బాబూ?
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి పేద, మధ్య తరగతి కుటుంబాలపై అధిక భారం వేయనుందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. పాతపట్నంలోని తన క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారని, అవసరమైతే విద్యుత్ చార్జీలను 30 శాతం తగ్గిస్తామని ఇచ్చిన హామీ ఏమైందన్నారు. రాష్ట్ర ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చలేని ఈ ప్రభుత్వం.. పన్నులు, విద్యుత్ చార్జీలను ఎలా పెంచుతుందని నిలదీశారు. కూటమి నాయకులు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి గెలిచారని, అధికారం చేపట్టిన తక్కువ రోజుల్లోనే మాట తప్పారన్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమైందని అన్నదాత సుఖీభవ పథకం ఎప్పుడు ఇస్తారని నిలదీశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మాత్రమే మద్యం విక్రయాలు జరిగాయన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన ఐదు నెలల్లోనే ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి, గ్రామ స్థాయిలోకి మద్యం తీసుకువచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని కోరే ప్రభుత్వం లేదని, మంత్రి లోకేష్ రచించిన రెడ్‌బుక్ పాలన సాగుతోందన్నారు. కూటమి ప్రభుత్వ ఆరాచకాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎ.వి.సురేష్, చింతాడ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన



ధర్నా చేస్తున్న ఏజెంట్లు

నరసన్నపేట: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఏజెంట్లు నిరసన చేపట్టారు. వారం రోజులుగా మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలియజేస్తున్నా యాజమాన్యం దిగిరాకపోవడంతో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నరసన్నపేట బ్రాంచ్ ఏజెంట్ల సంఘం కార్యదర్శి ఉప్పాడ పూర్ణారావు మాట్లాడుతూ.. పాలసీదారుల బోనస్ పెంచాలని, బీమా పాలసీలు పాత పద్ధతి ప్రకారం కొనసాగించాలని, పాలసీలపై జీఎస్టీ రద్దుతోపాటు తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ ధర్నాకు ఎల్ఐసీ స్టాఫ్ యూనియన్ తరపున ఆర్.సురేష్‌బాబు, డవలప్‌మెంట్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.గడ్డెను, మెండ చిన్నావాడు, బోయిన కొండలరావు, జి.లక్ష్మీనారాయణ, ఎల్.వి.రమణమూర్తి, వారణాశి బుజ్జి, గొలివి శ్రీనివాసరావు, పెంట బాబు, కొర్ను నర్సింగరావు, దాము వెంకటేశ్వరులు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



ప్రమాణం చేస్తున్న యూటీఎఫ్ మండల శాఖ నాయకులు

కొత్తూరు: యూటీఎఫ్ మండల శాఖ నూతన కమిటీ ఎన్నిక కొత్తూరులో సోమవారం నిర్వహించారు. కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా శాఖ అధ్యక్షుడు బాబూరావు తెలిపారు. మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా కరకవలస విజయ్‌కుమార్, వాన మధుసూదనరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దేవరశెట్టి స్వర్ణలత, కర్రి బాలకృష్ణ, కోశాధికారిగా బూడిద వీరభద్రయ్య, జిల్లా కౌన్సిలర్లుగా కె.తిరుమలరావు, టి.ప్రకాష్, డి.ప్రకాష్, టి.సురేష్, కొండలరావు, సంతు గణపతి, గౌరవ అధ్యక్షుడిగా శోభన్‌బాబు, పలువురు కమిటీ సభ్యులు, పలు విభాగాలకు కన్వీనర్‌లను ఎన్నుకున్నారు.

స్వర్ణోత్సవాలు జయప్రదం చేయాలి..

యూటీఎఫ్ ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు బాబూరావు కోరారు. మండలంలోని మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల శాఖ సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు. జిల్లా, మండల శాఖ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వంతో గ్రామాలు అభివృద్ధి బాటలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మండలం తొగరం గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ.1.39 కోట్లతో నిర్మించనున్న అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ వెంకటరావు, ఏపీఓ లక్ష్మీనరసమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పశుగణనకు సహకరించాలి

పశుసంవర్ధకశాఖ ద్వారా నిర్వహిస్తున్న పశు గణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపునిచ్చారు. ఆమదాలవలస పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద 21వ పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరించారు. పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు రోణంకి ఆనందరావు, పశువైద్యులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1,94,666



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. రూ.1,94,666 ఆదాయం వచ్చినట్లు ఈఓ రవి తెలిపారు. ఈ ఏడాది జూన్ ఐదో తేదీన హుండీ లెక్కించామని, అప్పట్లో రూ.2.70 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఎండోమెంట్ సీనియర్ అసిస్టెంట్ రవికుమార్, ఆలయ ట్రస్టీ వీరభద్రస్వామి, ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మస్తర్లలో దిద్దుబాట్లు

సారవకోట: మండలంలోని కూర్మనాథపురం పంచాయతీలో సోమవారం జరిగిన సోషల్ ఆడిట్‌లో 15 మంది వేతనదారుల మస్తర్లలో దిద్దుబాట్లున్నాయని ఎస్ఆర్పీ పున్నపు నాయుడు తెలిపారు. మండలంలో 2023–24 నాటి ఉపాధి హామీ నిధుల ఖర్చులకు సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నామన్నారు. ఐదు చెరువులలో జరిగిన పనుల కొలతల్లోనూ తేడాలున్నట్లు గుర్తించామన్నారు. ఎస్ఆర్పీ తిరుపతిరావు, మాజీ సర్పంచ్ బొడ్డెపల్లి సుధాకరరావు ఉన్నారు.

ఉద్యానవనశాఖలో విలీనం చేయండి

మెళియాపుట్టి: ఉద్యానవన శాఖలోకి వీఏఏలను విలీనం చేయాలని ఉద్యాన సహాయకుల రాష్ట్ర జనరల్ సెక్రటరీ దుక్క శరత్ (మెళియాపుట్టి మండలంలో వీఏఏగా పనిచేస్తున్నారు.) అన్నారు. డీహెచ్ఓ ఆర్.వి.వి.ప్రసాద్‌ను సోమవారం శ్రీకాకుళంలో కలిసి వినతిపత్రం అందించారు. మాతృశాఖ అయిన ఉద్యానవనశాఖలో విలీనం చేయాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. రాష్ట్రంలో 2429 మంది వీఏఏలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని, పనిభారం అధికంగా ఉందన్నారు. పంటల విస్తీర్ణాన్ని దృష్టిలో పెట్టుకుని క్లస్టర్లను కేటాయించాలని, ఉద్యానవనశాఖలో ప్రత్యక్షంగా పనిచేసేలా అవకాశం కల్పించాలన్నారు.

పట్టపగలే ఇసుక అక్రమ రవాణా !



దన్నానపేట వద్ద ఇసుక లోడుతో ఉన్న వాహనాలు

ఆమదాలవలస: మండలంలోని వంశధార, నాగావళి నదుల నుంచి ఇసుకను అక్రమంగా తవ్వకం చేస్తూ పలుచోట్ల పోగులు వేసి రాత్రి సమయంలో లారీల్లో విశాఖపట్నం, విజయనగరం తదితర ప్రాంతాలకు తరలించేవారు. కొద్ది రోజులు అలా చేసిన ఇసుకాసురులు ప్రస్తుతం బరితెగించి పట్టపగలే ఇసుకను అక్రమంగా లారీల్లో తరలిస్తున్నారు. దన్నానపేట ప్రభుత్వ పాలటెక్నిక్ కళాశాల ఎదురుగా ఉన్న రోడ్డుపైనే సోమవారం ఇసుకను లారీల్లో లోడ్ చేశారు. విషయం స్థానిక అధికారులకు తెలిసినా.. ఎటువంటి కేసులు నమోదు చేయకపోవడంపై ఆంతర్యమేమిటో అర్థం కావడంలేదని స్థానికులు అంటున్నారు.

గోతులమయం



ఎల్.ఎన్.పేట మండలంలోని ఏబీ (అలికాం–బత్తిలి) రోడ్డు నుంచి కరకవలస మీదుగా కడగండి వరకు ఉన్న ఆర్ అండ్‌బీ రోడ్డు గోతులమయంగా మారింది. చెరువును తలపించేలా గోతులు దర్శనమిస్తున్నాయి. ద్విచక్ర వాహనంపై కూడా వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. వంశధార హైలెవల్ కాలువ వద్ద రోడ్డు మరింత పాడైంది. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని స్థానికులు, కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

ఆదమరిస్తే అంతే..



సారవకోట మండలంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో నిర్మించిన మురుగునీటి కాలువలపై వేసిన పలకలు పలుచోట్ల విగిరిపోయాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో పలకలు విరిగి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అంగూరు సచివాలయానికి ఎదురుగా మురుగునీటి కాలువపై ఉన్న పలక విరిగింది. విరిగిన పలకపై సచివాలయ సిబ్బంది రేకును కప్పారు. దీనిపై సంబంధిత డీఈఈ భాస్కర్‌ను వివరణ కోరగా.. పాడైపోయిన పలకల స్థానంలో కొత్త పలకలు వేయిస్తామని తెలిపారు.

– సారవకోట

బోరు బాగు చేయరూ..



పాతపట్నం మండలం బైదలాపురం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న బోరు రెండు వారాలుగా పనిచేయడం లేదు. ఈ బోరే గ్రామస్తులకు ఆధారం. తాగునీటికి విద్యార్థులు, గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. సంబంధిత అధికారులు బోరును బాగు చేయాలని కోరుతున్నారు.

– పాతపట్నం

అల్లుకున్న నిర్లక్ష్యం



విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనంగా కొత్తూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దుస్థితి చూస్తే తెలుస్తోంది. కొత్తూరులో సగానికి ఎక్కువగా విద్యుత్‌ను ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచే సరఫరా అవుతోంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు పిచ్చిమొక్కలు అల్లుకున్నాయి. ఏ సమయంలోనైనా మరమ్మతులకు గురయ్యే అవకాశం ఉంది. విద్యుత్ సిబ్బంది స్పందించి పొదలను తొలగించాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

– కొత్తూరు

వంట గది ప్రారంభం



వంటగదిని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: స్థానిక నీలకంఠేశ్వర ఆలయం ఆవరణలో రూ.4 లక్షలతో నిర్మించిన వంట గదిని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ప్రారంభించారు. రెడ్డి నాగభూషణరావు జ్ఞాపకార్థం.. తమ సొంత నిధులతో వంట గదిని నిర్మించినట్లు రెడ్డి శాంతి తెలిపారు. ఆలయంలో వంటలు చేయడానికి, శివ భక్తులకు ఈ వంట గది ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం.తాతయ్య, మండల ప్రత్యేక సలహాదారుడు ఎం.గణపతిరావు, మండల కోఆప్షన్ సభ్యుడు మాధవ్ పుల్లాయ్, ఆలయ మాజీ చైర్మన్ నూలు ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ మజ్జి జోగారావు, ఎల్.ఎన్.పేట మాజీ ఎంపీపీ శిమ్మ సాంబశివరావు, బి.నారాయణమూర్తి, పనుకు మోహన్, జి.రాము, సి.హెచ్.త్రినాథరావు, టి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం



నరసన్నపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు: రైతుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం గుగ్గిలి రెవెన్యూ గ్రామ సభలో మాట్లాడారు. ఒక వ్యక్తికి ఒక ఖాతా ఇవ్వడం జరుగుతుందన్నారు. తహసీల్దార్ జెన్ని రామారావు, మండల సర్వేయర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: రైతుల భూములను కాపాడటానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి 21వ వార్డు రావికండిపేటలో తహసీల్దార్ రాంబాబు అధ్యక్షతన సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ..

పాతపట్నం: మండలంలోని బైదలాపురంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల భూ సమస్యలపై 26 దరఖాస్తులు స్వీకరించామని రీ సర్వే డీటీ సునిల్‌కుమార్ తెలిపారు. రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని డీటీ సూచించారు. మండల ప్రత్యేక సర్వేయర్ నారాయణరావు, వీఆర్వోలు, విలేజ్ అసిస్టెంట్ సర్వేయర్‌లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట: మేజరు పంచాయతీలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏడీ ఇందర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌హెచ్ సర్వీస్ రోడ్డులోని 11 కేవీ లైన్‌లో ఏబీ స్విచ్‌లు వేయనున్నట్లు పేర్కొన్నారు. సత్యవరం, మారుతీనగర్ ఎనిమిది వీధుల్లో, శ్రీరామనగర్ నాలుగు వీధుల్లో, విజయలక్ష్మీనగర్, శ్రీనివాసనగర్‌కు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

నిర్వాసితుల ముసుగులో అక్రమాలు



ఏఓకు ఫిర్యాదు చేస్తున్న బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్ ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న కొంతమంది.. నిర్వాసితుల ముసుగులో చేసిన అక్రమాలపై విచారణ చేపట్టాలని అదే కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బూర్లె శ్రీనివాసరావు, ఎస్.బాలరాజు సోమవారం టెక్కలి ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. హిరమండలం మండలంలోని బర్రిపేటకు, కొత్తూరు మండలానికి చెందిన కొంత మంది ఇళ్ల స్థలాలు, యూత్, పలు రకాల ప్యాకేజీలలో అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమాలపై సెప్టెంబర్ 23న కలెక్టర్‌తోపాటు పలువురు అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. అక్రమాలకు పాల్పడినవారిలో టీడీపీకి చెందినవారు కొంతమంది తనపై ఈ నెల 5వ తేదీన అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేశారని శ్రీనివాసరావు తెలిపారు. ఎటువంటి ఆధారాలు లేకుండా చేసిన ఫిర్యాదుపై వెంటనే విచారణ చేపట్టారన్నారు. టీడీపీ నాయకుల ఒత్తిడితోనే తనపై విచారణ చేసినట్లు చెప్పారు. అన్ని ఆధారాలతో తాను ఫిర్యాదు చేస్తున్నా.. విచారణ చేయకపోవడం అన్యాయమని శ్రీనివాసరావు అన్నారు.